క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట

కోసిగి: మండల పరిధిలోని గౌడుగల్లు గ్రామంలో పెద్దమ్మ దేవి, సుంకులమ్మ దేవి, రామక్కమ్మ దేవి, లక్ష్మమ్మ దేవి విగ్రహాలను నూతనంగా నిర్మించిన ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో ప్రతిష్టించారు. నవరత్న పంచ హోమం, నవధ్యానం, దేవత సహిత విగ్రహ ప్రతిష్ట కళ, ప్రాణప్రతిష్ట, అర్చన అభిషేకము, చండి హోమం, పూర్ణహుతి తదితర పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు అందజేత



బెబి కుర్చీలు పంపిణీ చేసిన దృశ్యం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని అమరావతి కాలనీ అంగన్‌వాడీ కేంద్రానికి శక్రవారం క్రెడిట్యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ ప్రతినిధులు బెబీ కుర్చీలు ఇచ్చారు. సీడీపీఓ ఉమా మహేశ్వరి సమక్షంలో 30 బెబీ కుర్చీలు, 4 కుర్చీలు, 2 కార్పెట్‌లను అందజేశారు. చిన్నారుల సౌకర్యార్థం తమవంతుగా బేబీ కుర్చీలు అందజేశామని తెలిపారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ రాగిణి వసంత, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీవీ సుబ్బారెడ్డి, అసిస్టంట్ బ్రాంచ్ మేనేజర్ హనుమంతు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

కోసిగి: మండల పరిధిలోని చిర్తనకల్లు గ్రామానికి చెందిన రైతు పాలాక్షి చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. రైతు తెలిపిన వివరాల మేరకు వ్యవసాయ పనుల రెండు ఎద్దులను కొనుగోలు చేసి తెచ్చుకున్నాడు. అయితే శుక్రవారం పొలంలో మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లింది. ట్రాన్స్ ఫార్మర్ నుంచి భూమికి ఎర్తింగ్ అవుతుండడంతో షాక్‌కు గురై ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



తాయన్నతో ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కోటేకల్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి జి.తాయన్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు భీమన్న తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తాయన్న జిల్లా స్థాయి అండర్–17 బేస్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడని చెప్పారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు గుంటూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు వ్యాయమ ఉపాధ్యాయుడు ఉమాపతి, ఉపాధ్యాయులు గంగాధర్, విజయలక్ష్మి, పద్మావతి, నాగరాజు లక్ష్మన్న, శ్రీధర్, హసీనా, మల్లికార్జున, గణపతి, రమేష్, విజయ్‌కుమార్, వీరభద్రప్ప, లలిత, ఉషాకుమారి అభినందించారు.

ఆ ప్రిన్సిపాల్‌కు పోస్టింగ్ ఇవ్వొద్దు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కేజీబీవీలో విద్యార్థుల ఆకలి కేకలకు కారణమై తొలగించబడ్డ ప్రిన్సిపాల్ కవితను అదే పాఠశాలకు మళ్లీ పోస్టింగ్ ఇవ్వడం సరికాదని విద్యార్థి సంఘాల నాయకులు అభ్యంతరం తెలిపారు. శుక్రవారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్య, యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శేఖర్ నాయుడు, ఉదయ్ తదితరులు డీఈఓ శ్యాముల్‌పాల్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. గత ఆగస్టు నెలలో ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలపై జిల్లా, మండల స్థాయి అధికారులు చేసిన విచారణలో అక్రమాలు నిజమేనని తేల్చారన్నారు. విధుల నుంచి తొలగించిన ప్రిన్సిపాల్‌ను అదే పాఠశాలకు నియమించడం సమంజసం కాదన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు తగ్గించడం తగదు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు డీలర్లు కందిపప్పు కోటాను తగ్గించడం సరికాదని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యునియన్, సీఐటీయూ నాయకులు గోవర్ధనమ్మ, గోవిందు, రాముడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని 43,62,68,69,70 నంబర్ల అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ డీలర్ (నం.28) కందిపప్పు కోటా తగ్గించి ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఐ సుదర్శన్‌రెడ్డి బదిలీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.సుదర్శన్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూల్ సైబర్ క్రైం సెల్ సీఐ వి. శ్రీనివాసులు బదిలీపై రానున్నారు. కాగా సుదర్శన్‌రెడ్డి ఈ ఏడాది ఆగస్టు 2న బాధ్యతలు చేపట్టగా మూడు నెలలకే బదిలీ కావడం గమనార్హం. ఆయనకు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం



రైతు అందజేసిన వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్,



వివరాలను అధికారుల ద్వారా తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: ప్రతి భూ సమస్యను పరిష్కరిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. మండలంలోని మాంత్రికి, దయ్యాలగుడ్డం గ్రామాలకు సంబంధించి గ్రామసభను శుక్రవారం మాంత్రికి గ్రామంలో నిర్వహించారు. ఈ గ్రామ సభకు హాజరైన సబ్‌కలెక్టర్ రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివ రాముడు, రీ సర్వే ఉప తహసీల్దార్ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం స్థల పరిశీలన

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని రైల్వేగేటుకు సంబంధించి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం స్థల సేకరణ ప్రాంతాలను శుక్రవారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. స్థానిక అధికారులతో కలిసి వివరాలను సేకరించారు. ఈ ఫ్లై ఓవర్ ఎక్కడి నుంచి ఏర్పాటు చేయాలి, ట్రాఫిక్‌ను ఎలా మళ్లించవచ్చన్న విషయాలపై చర్చించారు. సబ్‌కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఉప తహసీల్దార్ గుండాల నాయక్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, మండల సర్వేయర్ ఈశ్వర్ ప్రసాద్, రైల్వే డిప్యూటీ ఇంజనీర్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పక్కాగా నిర్వహించాలి

ఆదోని రూరల్: త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా పక్కాగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో డివిజన్ స్థాయి రెవెన్యూ మైనర్ ఇరిగేషన్ ఉద్యోగులకు శిక్షణ నిర్వహించారు. ట్యూటర్‌లు సందేహాలను నివృత్తి పరిచారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ఆయకట్టు భూములు కలిగి ఉన్న రైతులందరూ ఓటర్లుగా ఉండాలన్నారు. ఆయకట్టు భూమి ఉండి పేరులేని రైతులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన రీసర్వే గ్రామ సభలు



నాగలదిన్నెలో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్

నందవరం: మండలంలో భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన రీ సర్వే గ్రామ సభలు ముగిశాయి. శుక్రవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామ సభ జరిగింది. రైతుల నుంచి వివిధ రకాల అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సభల ద్వారా వచ్చిన అర్జీలను రెండు వారాల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ఎల్‌పీ నంబర్లలో తప్పులు, భూ విస్తీర్ణంలో తేడాలు, ఒకే సర్వే నంబర్లు విభజన వంటి సమస్యలరు వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఆర్‌ఐ జెర్మియా, సర్వేయర్ అక్బర్‌బాషా, వీఆర్వోలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న సీఐ రామాంజులు

మంత్రాలయం: అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రాలయం సీఐ రామాంజులు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఐ పరమేష్‌నాయక్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. అక్రమంగా ఎవ్వరైనా మద్యం అమ్మకాలు జరిపితే వెంటనే మా దృష్టికి తీసుకుని రావాలని, పేర్ల గోప్యంగా ఉంచుతామన్నారు. అదే విధంగా ప్రభుత్వంపై అసత్య, దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక అవసరమైన వారు అనుమతులు పొంది తీసుకోవాలని సూచించారు. మంత్రాలయం వచ్చే భక్తులకు లాడ్జి యాజమానులు అధిక ధరలకు రూమ్‌లను అద్దెలకు ఇవ్వకూడదని, నిర్ణీత ధరలు కేటాయించాన్నారు. అదేవిధంగా సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అక్రమంగామద్యం అమ్మకాలు చేసిన వారిపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. రాఘవేంద్రనగర్‌లో మద్యం అమ్ముతున్న పలువురి పై కేసులు నమోదు చేసి అమ్మకాలు జరపరాదని కౌన్సిలింగ్ ఇచ్చామని సీఐ వివరించారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీటీకి వినతిపత్రం అందచేస్తున్న 104 ఉద్యోగులు

ఎమ్మిగనూరురూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగులు హరి, తిరుమలేష్, నాగరాజ్, వీరేష్ కోరారు. శుక్రవారం 104 ఉద్యోగుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలలుగా తమ జీతాలు అందలేదని వాపోయారు. కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2020 తరువాత విధుల్లో చేరిన 104 డ్రైవర్, డీఈఓలకు జీఓ నం.7 ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలన్నారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణశివారులోని మాధవరం రోడ్డు తాయమ్మ గుడి సమీపంలో శుక్రవారం రెండుకార్లు ఢీకొనడంతో ఐదు మందికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బళ్లారికి చెందిన కృష్ణయ్య, విజయలక్ష్మి, శివకుమార్ కారులో మంత్రాలయం వెళ్లి పని ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. అదేవిధంగా ఆదోని నుంచి మల్లిక, ఈరమ్మ, గోవిందమ్మ కారులో కోసిగి మండలంలోని మూగలదొడ్డికి బయలుదేరారు. తాయమ్మ గుడి వద్ద రెండు కార్లు ఢీకొన్నాయి. బళ్లారికి చెందిన గోవిందమ్మ, కారు డ్రైవర్ నరేష్, మల్లికలకు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని కునిముల్లా కాలనీకి చెందిన అల్తాఫ్ అనే వ్యక్తిపై త్రీటౌన్ పోలీసులు పోక్సో చట్టం కింద శుక్రవారం కేసు నమోదు చేశారు. అల్తాఫ్ ఓ మైనర్ బాలికను ప్రేమించాలని అసభ్యకరంగా మాట్లాడడం, ఫోటోలు తీయడం లాంటి చర్యలకు పాల్పడ్డాడు. మైనర్ బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే నిరాధార ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు

ఆదోని రూరల్: మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి చేసిన వ్యాఖ్యలు నిరాధారమైనవని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు శ్రీలక్ష్మి, రేణుక, సుగుణమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదోని ప్రజలను హింసించి దోచుకున్నారని ఎమ్మెల్యే పార్థసారథి ఓ ఛానెల్ డిబెట్‌లో చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి నిరాదరణమైన ఆరోపనలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతున్నాడని చెప్పారు. ఈ ఐదు నెలల అధికారంలో కూటమి ప్రభుత్వం ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఆదోని పట్టణంలో మెడికల్ కాలేజీ, బైపాస్ రోడ్డుతో పాటు అనేక సంక్షేమ పథకాలను చేపట్టిన ఘనత మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆదనిలో ఇసుకంతైనా అభివృద్ధి జరగలేదని పార్థసారథి పేర్కొనడం సిగ్గుచేటన్నారు. ఆదోని పట్టణంలో నాటుసారా, రేషన్ బియ్యం అక్రమ సరఫరా, అసాంఘిక శక్తులకు నిలయంగా మారిందన్నారు. ఈ మధ్యకాలంలో ఆదోని పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలో ఓ ప్రైవేట్ డాక్టర కోటి న్నర విలువ స్థలాన్ని దొంగ రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్డంగా దొరికిపోయినా ఎమ్మెల్యే పార్థసారథి, పోలీసులు పట్టించుకోలేదని విమర్శించారు.

నేడు ఓటరు నమోదు, పరిశీలన

కోసిగి: కోసిగి మండలంలోని గ్రామాల్లో బూత్ లెవెల్‌లో శని, ఆదివారాలు ఓటు నమోదు, పరిశీలన ప్రక్రియ చేపట్టాలని తహసీల్దార్ నిత్యానందరాజు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రజలకు బూత్ లెవెల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండి ప్రత్యేక క్యాంప్ నిర్వహించాలని సూచించారు. కొత్తగా ఓటరు నమోదు, ఓటరు కార్డులో అభ్యంతరాలు ఉంటే నమోదు చేసుకోవాలని సూచించారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న షబీర్ బాషా

ఆదోని సెంట్రల్: పోరాటాలతోనే విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షబీర్ బాషా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, సీపీఐ మండల పట్టణ కార్యదర్శులు కల్లుబావి రాజు, సుదర్శన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని విశ్వనారాయణ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ పట్టణ కార్యదర్శి దస్తగిరి అధ్యక్షతన జరిగిన సంఘం ఆదోని జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. వెనుక బడిన ప్రాంతమైన ఆదోనిలో ప్రభుత్వ విద్యారంగ సంస్థలు సరిగా లేవని, ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు పోవాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కళాశాల ప్రారంభమైతే ఎంతో ఉపయోగపడుతుందని సంతోషించామని, కూటమి సర్కార్ నిర్మాణ పనులు నిలిపివేయడం సమంజసం కాదని హెచ్చరించారు. ఇప్పటికైన ప్రభుత్వం నిలచిపోయిన నిర్మాణ పనులను తిరిగి చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐఎస్‌ఎఫ్ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షునిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా వీరేష్, సందీప్, శివకుమార్, అబ్దుల్లా, మండల ప్రధాన కార్యదర్శిగా దస్తగిరి, సహాయ కార్యదర్శులుగా మోహన్, ఉసేన్, మహబూబ్ బాషా, కార్తిక్, కోశాధికారిగా శేఖర్, మహిళా కన్వీనర్‌గా సి. చంద్రకళ, కో కన్వీనర్లుగా చంద్రలేఖ, సాబీర్, ముస్కాన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సోము, వినయ్, అంజి, మహేష్, వీరేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని అలవర్చుకోవాలి

కోసిగి: పాఠశాల స్థాయి నుంచే దేశభక్తి, సేవా గుణం అలవరుచుకోవాలని కోసిగి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరారెడ్డి, ఎంఈఓ-2 శోభరాణి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 62 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు 75వ భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డేను పురస్కరించుకుని ఫ్లాగ్ డే స్టిక్కర్స్ మేళా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు స్థానిక వైఎస్సార్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సర్కిల్, బస్టాండ్‌లలో విద్యార్థులు పిరమిడ్ ఆకారంలో ఏర్పడి సెల్యూట్ చేశారు. అలాగే స్కౌట్స్ గైడ్స్ ప్రదర్శన చేసి గురువులకు సెల్యూట్ వందనం సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపాల్ భాగ్య లక్ష్మి, సైన్స్ టీచర్ మధుబాబు, స్కౌట్స్ మాస్టార్ సుందర్ కుమార్, గైడ్స్ టీచర్ రాజేశ్వరి, విద్యా కమిటీ చైర్మన్ నారాయణ, సీఆర్‌పీ ఉసేని తదితరులు పాల్గొన్నారు.



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో ప్రిన్సిపాల్ సమీరారెడ్డి, ఎంఈఓ-2 శోభరాణి



పిరమిడ్ ఆకారంలో సెల్యూట్ చేస్తున్న విద్యార్థులు

దిబ్బనదొడ్డిలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: మండల పరిధిలోని దిబ్బనదొడ్డి గ్రామంలోని శివాలయంలో శివలింగం, నంది, గణపతి విగ్రహం, ధ్వజ స్తంభం, బొడ్డురాయి ప్రతిష్టాపన కార్యక్రమం కర్ణాటక రాష్ట్రంలోని గబ్బూరు పీఠాధిపతి శ్రీబుదిబసవేశ్వర స్వామి ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. అనంతరం దేవాలయంలో హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హోమంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, బాబిరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

కర్నూలు(అర్బన్): నందవరం ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డీవైఎఫ్‌ఐ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు రంగప్ప జిల్లా పంచా యతీ అధికారి జీ.భాస్కర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీ లో దాదాపు 300 కుటుంబాలు నివశిస్తున్నాయని, గత ఐదేళ్లగా తాగునీరు సరఫరా కాకపోవడం వల్ల ఉదయం 5 గంటలకే బస్టాండ్ వద్దకు వచ్చి నీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. కాలనీ బోరులో వచ్చే నీళ్ల దుర్వాసన, ఉప్పుగా ఉన్నాయని, ఈ నీటిని ఎలా తాగా లని ప్రశ్నించారు. నాయకులు సురేష్, మల్లేష్, కిషోర్ ఉన్నారు.

అధిక ధరలపై సీపీఎం ప్రజాపోరు



కరపత్రాలను పంచుతున్న నాయకులు

ఆదోని రూరల్: అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలపై దాడులు, విద్యుత్ చార్జీల పెరుగుదలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రజాపోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న తెలిపారు. ఆదోని పట్టణంలోని కార్వన్‌పేట ఏరియాలో సీపీఎం ప్రచార క్యాంపియన్ సందర్భంగా శుక్రవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజుల నుంచి కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంటనూనెల ధరలు, ఆకాశాన్ని అంటాయన్నారు. రాష్ట్రంలో ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ ఎన్నడూ లేనంత ధరలు పెరుగుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల అదుపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం తరహాలో రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు వీరేష్, వెంకటేశులు, నాగేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు



సీఐ గంగాధర్

గోనెగండ్ల: ఇసుక కావాల్సిన వారు సంబంధిత అధికారుల అనుమతి మేరకే తెచ్చుకోవాలని, నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాన్య ప్రజలకు ఉచిత ఇసుక అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలోని నదీ పరివాహక ప్రాంత ప్రజలకు పలు సూచనలు కూడా ఇచ్చామన్నారు. జేసీబీలతో ఇసుక తోడినా, ఎక్కడైనా అక్రమంగా నిల్వ చేసినా, అధిక ధరలకు విక్రయించినా, ఇతర రాష్ట్రాలకు తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాగులు, వంకల్లో ఇసుకను సొంత అవసరాల నిమిత్తం మనుషులతో తోడించి తీసుకెళ్లవచ్చని చెప్పారు. గ్రామ సచివాలయం దగ్గర లేదా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించిన తర్వాతే ఇసుకను తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. సంబంధించిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. తోలిన ఇసుకను అవసరం ఉన్న వ్యక్తి ఇంటి వద్ద మాత్రమే డంప్ చేయాలన్నారు. తరచూ ఇసుక తరలించే బాడుగ ట్రాక్టర్ల యజమానులు తమ వాహనాలకు జీపీఎస్ పరికరం అమర్చుకోవాలని సూచించారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే వారి వివరాలను పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. ఉచితం మాటున ఇసుక తీసుకొచ్చి ఎక్కువ రేటుకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల పట్టివేత

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని బావూజీపేటకు చెందిన విజయ్ ఇంటి వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ సైదుల్ శుక్రవారం తెలిపారు. విజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. 192 కర్ణాటక బుడ్డీలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

డ్రైవర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని టౌన్: ఆదోని ఆర్టీసీ డిపోలో రోజువారి వేతనంతో డ్రైవర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జి మల్లికార్జున తెలిపారు. ఆదోని పరిసర ప్రాంతాల్లోని హెవీ లైసెన్స్ కలిగిన డ్రైవర్లు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డుతో డీఎం కార్యాలయంలో సంప్రదించాలన్నారు. లైసెన్స్, డ్రైవింగ్ తోపాటు ఆరోగ్య భద్రత మేరకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

వాహనాల తనిఖీ

ఆదోని అర్బన్: పట్టణంలోని మేదర వీధి వద్దనున్న న్యూ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డు మరమ్మతులు చేపడుతుండడంతో ట్రాఫిక్ జామ్ గాకుండా వాహనాలను మళ్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ సైకిళ్లపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్లలో సీటు బెల్టును ధరించాలన్నారు. వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు నెమ్మదిగా వెళ్లాలన్నారు. అతివేగంగా వాహనాలను నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానా తప్పదని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: పట్టణంలో విద్యుత్ మెయింటినెన్స్ పనుల నిమిత్తం రెండో శనివారం పట్టణంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పురుషోత్తం శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలో అన్ని వీధుల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

శ్రీమఠంలో ఎమ్మిగనూరు డీఎస్పీ

మంత్రాలయం: రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు శుక్రవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు పూజలు చేశారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ మఠం అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీ మఠంలో జరిగే రథోత్సవ సేవల్లో పాల్గొన్నారు. డీఎస్పీ వెంట మంత్రాలయం సీఐ రామంజులు, ఎస్‌ఐ పరమేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలి

ఆదోని రూరల్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలని మాల మహానాడు ఆదోని పట్టణ అధ్యక్షుడు ఎం.బొబ్బిలి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మల్లెల వెంకటరావు అధ్యక్షతన జరగబోయే చలో చీరాల కార్యక్రమాన్ని అన్ని సంఘాల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు మహానంది, అడ్వైజర్ కేశవ్ మాస్టర్, వెంకటేశులు, మండల నాయకులు దాసరి నరేష్‌కుమార్, చాగి రాము, చాగి గిరప్ప, వీరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.